యువత స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

చిక్కడపల్లి: యువత స్వశక్తితో ఆర్థికాభివృద్ధి సాధించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ సూచించారు. గాంధీనగర్ డివిజన్‌లో వైజంక్షన్‌లో సాయికృష్ణ ఏర్పాటు చేసిన టిఫిన్, కర్రీ పాయింట్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, నాయకులు ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, స్థానికులు రామారావు, రామ్‌భాయ్, ఆకాష్‌యాదవ్, అశుతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలోని సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 5, 6 తరగతుల్లో అడ్మిషన్ల కోసం మెరిట్ ఆధారంగా తీసుకుంటున్నారని, దీంతో గ్రామీణ నిరుపేద విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో సీట్లు దొరకడం లేదన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికి సీట్లు ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రినే నియమించలేదని ఆయన విమర్శించారు. నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కల్పించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడు చకిలం రంగారావు మృతి



నల్లకుంట: విశ్రాంత వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రంగారావు గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఇతర ప్రముఖులతో కలిసి మృతుడి నివాసానికి వెళ్లి రంగారావుకు నివాళులర్పించి మాట్లాడారు. చకిల రంగారావు మృతి బ్రాహ్మణ సంఘాలకు తీవ్ర మనస్తాపాన్ని కలిగించిందన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. టీబీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రతినిధులు కానాల శ్యాంసుందర్‌రావు, కె. శంకర్‌రావు, కోట్రా సతీష్, గూడా జయరాం, చకిలం నాగేందర్‌రావు తదితరులు నివాళులర్పించారు.

మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

పంజగుట్ట: మంత్రి వర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలని, లేని పక్షంలో జూన్ 8న రెండు వేల మంది లంబాడీ మహిళలతో గాంధీ భవన్ ఎదుట చీరలు, గాజులతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు గణేష్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్ బంజారా అన్నారు. ఈ నిరసనతో నైనా లంబాడీ ఎమ్మెల్యే, ఎంపీల్లో స్పందన వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గిరిజన మహిళలతో గాజులు, చీరలు ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ .. తెలంగాణలో లంబాడీలు కాంగ్రెస్ వెంట ఉన్నందుకే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 22 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి మహిళా విభాగం నాయకులు పున్ని బాయి, అనితా బాయి, దేవి బాయి, అచ్చి బాయి, వసంత బాయి తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

పంజగుట్ట: వెంకటరమణ కాలనీలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడం, వారు వెంటనే అక్కడకు చేరుకోవడంతో పెద్దప్రమాదం తప్పింది. వివరాలివీ... వెంకటరమణ కాలనీ నుంచి బంజారాహిల్స్ వెళ్లే మార్గంలో ఉన్న అద్విత నెస్ట్ అపార్ట్‌మెంట్ నాలుగవ అంతస్తులో ఓ డబుల్ బెడ్‌రూంలో మహిళల ఫ్యాషన్ డిజైనింగ్ బట్టలు కుట్టే ఓ బొటిక్ షాప్ ఉంది. షాపు నిర్వాహకులు గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో మూసివేసి ఎప్పటిమాదిరిగానే తాళం పక్కన ఫ్లాట్ వారికి ఇచ్చి వెళ్లారు. సుమారు ఎనిమిదిన్నర ప్రాంతంలో సదరు బొటిక్ నుంచి పెద్ద ఎత్తున మంటలు వస్తున్న విషయాన్ని ఎదురుగా ఉండే అపార్ట్‌మెంట్ వారు గుర్తించి సదరు అపార్ట్‌మెంట్ వారిని అప్రమత్తం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చి బొటిక్ తాళం తెరిచి చూడగా ఏసీ నుండి షాట్ సర్క్యూట్ అయి ఏసీ, బెడ్, టీవీ కాలిపోయాయి. వెంటనే అక్కడకు చేరుకున్న రెండు ఫైర్ ఇంజన్‌లు మంటలను ఆర్పివేశాయి.

ఇప్పటికిప్పుడు ఎక్కడికెళ్లాలి.?

- వాంబే గృహాలు ఖాళీ చేయాలంటూ అధికారుల అదేశం
- నోటీసులు అందజేసిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు
- ఇరవై ఏళ్లకే శిథిలావస్థకు చేరిన వాంబే గృహాలు



పై కప్పు పెచ్చులూడుతూ..



వాంబేగృహా వాసులకు నోటీసులు అందజేస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

కవాడిగూడ: కాంట్రాక్టర్ల ఉదాసీనత జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వలన పేదల కోసం కవాడిగూడ డివిజన్ పరిధిలోని బీమా మైదానంలో నిర్మించిన 'వాంబే'(వాల్మీకి అంబేడ్కర్ ఆవాస్ యోజన) పథకంలో భాగంగా 2006 సంవత్సరంలో నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరాయి. దీంతో రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని ముషీరాబాద్ నియోజకవర్గ టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తు అందులో నివసించే వారిని హెచ్చరిస్తున్నారు. ఇళ్లు కూలిపోతే ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందంటూ జిల్లా కలెక్టర్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న వాంబే కాలనీ వాసులు ఉన్నపలంగా ఇళ్లను ఖాళీ చేయమంటే ఎలా వెళ్లిపోతాం? అని ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా నివాసం ఉండేందుకు ఇళ్లను చూపిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్థానికులకు హామీని ఇచ్చినప్పటికీ వారు ఖాళీ చేసి వెళ్లడానికి సిద్ధంగా లేరు.

గత అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల ఉదాసీన వైఖరితో...

◆ గత అధికారుల నిర్లక్ష్యం.. కాంట్రాక్టర్ల ఉదాసీన వైఖరితో వాంబే కాలనీలో పలు బ్లాకుల్లో శ్లాబ్ ఊడిపోవడం, పిల్లర్ల పగుళ్లు ఏర్పడటం, స్టేర్ కేస్ కూలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీమా మైదానంలో ఉన్న మెజార్టీ ప్రజలు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇళ్లు నిర్మించే సమయంలో అధికారులు, కాంట్రాక్టర్లు శ్రద్ధ తీసుకోకుండా నామమాత్రంగా ఇళ్లను నిర్మించారని ఆరోపించారు. ఇప్పుడొచ్చి మరోచోటకి వెళ్తే వాంబే గృహాల స్థానంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తామని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. బీమా మైదానంలోని ఇళ్లను ఖాళీ చేసి వెళ్తే తమ ఉపాధి దెబ్బతిని కుటుంబపోషణ భారంగా మారుతుందని వాపోతున్నారు. ఇళ్లను ఖాళీ చేసిన తరువాత తమకు కేటాయించిన స్థలంలోనే మళ్లీ తమ ప్లాట్‌లు నిర్మించి ఇస్తారా? లేక పెండింగ్‌లో పెడతారా? అనే ఆందోళనలో స్థానికుల్లో ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన వాంబే గృహా సముదాయం

స్పష్టమైన హామీ ఇవ్వాలి



మాకు నిర్మించిన ఇచ్చిన ఇళ్ల పై కప్పులు కొన్నాళ్లకే పెచ్చులూడుతూ వచ్చాయి. గోడలకు పగుళ్లు రావడంతో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లాం. అయినా పట్టించుకోలేదు. ఇప్పుడు అధికారులు హడావిడిగా వచ్చి ఇళ్లను ఖాళీ చేయాలంటున్నారు. ఉన్నపలంగా మేము ఎక్కడికి వెళ్లాలి.

– కె.శంకర్, బీమా మైదాన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఉపాధి కోల్పోతాం



ఇరవై ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. చుట్టుపక్కన ఉండే అపార్ట్‌మెంట్లలో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాం. అధికారులు ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను ఖాళీ చేసి వెళ్లమంటే ఎలా వెళ్తాం.? – మమత,స్థానికురాలు

పిల్లల చదువులు ఎమైపోవాలి..



స్కూల్ ప్రారంభమయ్యే సమయంలో అధికారులు వచ్చి ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోండని అని అంటే ఎలా. మూడు సంవత్సరాలలో కొత్త ఇళ్లు నిర్మించి ఇస్తామని చెబితే పిల్లల చదువులు ఎమైపోవాలి.?

– సరోజ, స్థానికురాలు

ఎక్కడికి వెళ్లాలి?



ఇప్పుడు నా వయస్సు 80 సంవత్సరాలు. జీహెచ్ఎంసీ అధికారులు వచ్చి ఇళ్లు ఖాళీ చేయాలని చెబుతున్నారు. నోటీసులు కూడా ఇచ్చారు. వయో భారంతో ఇబ్బంది పడుతున్న నేను ఎక్కడికి వెళ్లాలి.? ఎలా బతకాలి.?

– లక్ష్మమ్మ, స్థానికురాలు

వేడుకగా అహల్యాబాయి హోల్కర్ జయంతి



చేనేత కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ నేత డాక్టర్ ఎస్.గౌతంరావు తదితరులు

కాచిగూడ: పుణ్యశ్లోక లోకమాత రాణి అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలను గురువారం కాచిగూడలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక పొదుపు గ్రూపు మహిళలు, బీజేపీ నేతలు కిలారి మనోహర్, అనంతలక్ష్మి, జ్యోతి, లావణ్య, తారా, వాసు, అరవింద్, శాంతాబాయి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

– చేనేత కార్మికులకు సన్మానం..

అంబర్‌పేట: రాణి అహల్యాబాయి జయంతి కార్యక్రమాన్ని బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం అంబర్‌పేట డివిజన్‌లో చేనేత కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్‌తో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాణి అహల్యాబాయి స్ఫూర్తిని కొనియాడారు. ఆమె చిత్ర పటానికి నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులఅర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు నరేష్‌గౌడ్, వనం రమేష్, నాగభూషణంచారి, వెంకటస్వామిగౌడ్, మైలారం రాజు, చేనేత కార్మికులు గట్టయ్య, కిలారి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ఉమా

గుంతల రోడ్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

చిక్కడపల్లి: 'గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టండి'అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జీహెచ్ఎంసీ ఏఈ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సిబ్బంది గురువారం అశోక్‌నగర్‌లోని రోడ్లకు మరమ్మతులు చేశారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కారణమైన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వెంటనే స్పందించి మరమ్మతుల చేయించిన అధికారులు అభినందనలు తెలిపారు.



అశోక్‌నగర్‌లో గుంతలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టండి

సాక్షి కథనం

మహిళ ఆత్మహత్య

చిక్కడపల్లి: కుంటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం ... చిక్కడపల్లి సూర్యనగర్‌లో నివసించే వెలిశాల స్వరూప(40), వృత్తిపరంగా ఇళ్లలో పనిచేసుకుంటూ భర్త పాపయ్య, ఇద్దరు కుమారులు పూర్ణచందర్(19), తరణ్(14)లతో కలసి జీవిస్తోంది. భర్త పాపయ్య సొంతూరు (కొండపూర్)లో ఇంటి స్థలం కొనడానికి అప్పు చేశాడు. అయితే అప్పు తీర్చకుండా మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య ఎంతచెప్పినా వినకుండా మద్యం తాగుతూ పిల్లలను భార్యని పట్టించుకోలేదు. బుధవారం కూడా మద్యం సేవించి ఇంటికి రాగా తన భార్య నిలదీయండంతో తన చిన్న కుమారుడు చరణ్‌ని తీసుకొని వాళ్ల అన్న దగ్గరికి వెళ్లాడు. భర్త విషయంలో ఎంతకి మార్పు రావడంలేదని మనస్థాపానికి గురైన స్వరూప అదే రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అక్క సమ్మవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

అందాల పోటీలను బహిష్కరించాలి

పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం రూ. 200 కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న అందాల పోటీలు మహిళల అంగాంగ ప్రదర్శనల వేదికలుగా కొనసాగుతున్నాయని మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక అభివర్ణించింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ అందాల పోటీలు, మార్కెట్ రాజకీయాలపై రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. పీఓడబ్ల్యూ సంధ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సామాజిక కార్యకర్తలు దేవి, సజయ, కృష్ణకుమారి, అంబికా, స్వరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..నిత్యం దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు అని మాట్లాడే బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌లు అందాల పోటీలు వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు. ఈ పోటీలు సామ్రాజ్యవాదం, పెట్టుబడి వ్యవస్థకు ప్రతీకలన్నారు. ఇటీవల మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అందాల పోటీల్లో పాల్గొంటున్న వారిని ఎగ్జిబిషన్‌లో బొమ్మలుగా చూశారని ఆరోపణలు చేసిందని గుర్తుచేశారు.

లక్షలు వెచ్చించినా లక్ష్యం నిల్

- రోడ్లపై పేరుకుపోతున్న చెత్త
- తూతూమంత్రంగా అధికారుల పర్యవేక్షణ

కాచిగూడ: ఏ కాలనీ చూసినా.. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం సర్వం చెత్తమయంలా ఉంది కాచిగూడ డివిజన్ పరిస్థితి. పలు ప్రాంతాల్లో చెత్తా చెదారం ఎక్కడికక్కడే పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తున్నామని, చెత్త డబ్బాల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌కు నేరుగా తరలిస్తున్నామని చెబుతున్నా అవి గాలి మాటలుగానే మిగిలిపోతున్నాయి. నారాయణగూడ, కాచిగూడ, నింబోలిఅడ్డ, కుద్బిగూడ, తదితర ప్రాంతాల్లో రోడ్లపై చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. కుక్కలు రోడ్డుపైకి చెత్తను ఈడ్చుకు వస్తుండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతుండటంతో రోడ్లపై వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలు అధికంగా వృద్ధి చెంది రోగాలు వ్యాపిస్తున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తడి, పొడి డబ్బాలు ఇచ్చినప్పటికీ అవి ఇంట్లో బియ్యం, పప్పులకు మాత్రమే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్యం కోసం ప్రభుత్వం లక్షలు వెచ్చించినా సరైన పర్యవేక్షణ లేక లక్ష్యం నీరుగారిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నారాయణగూడ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తకుప్పలు

టీజేఎస్ గ్రేటర్ ప్లీనరీ జూన్ 9న నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న గ్రేటర్ హైదరాబాద్ టీజేఎస్ అధ్యక్షుడు నర్సయ్య

ముషీరాబాద్: తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశాలను జూన్ 9న నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.నర్సయ్య తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ ప్లీనరీ సమావేశాన్ని గోషామహల్ నియోజకవర్గంలో జూన్ 9న నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్థానిక సమస్యలపై సమీక్ష చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ, డ్రైనేజీ, మంచినీటి సరఫరా, అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డుల పంపిణీ, వృద్ధులకు ఫించన్ వంటి సమస్యలపై అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రేటర్ పరిధిలో జన సమితిని బలోపేతం చేయడానికి భవిష్యత్ కార్యాన్ని రూపొందిస్తామన్నారు. ఈ ప్లీనరీ సమావేశాలకు ముఖ్యఅతిథిగా శాసన మండలి సభ్యులు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హాజరుకానున్నారని అన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అబ్జల్, లీగల్ సెల్ కన్వీనర్ డాక్టర్ ఇస్మాయిల్, నగర ఉపాధ్యక్షులు జయపాల్‌రెడ్డి, ఎం.లక్ష్మణ్, కోశాధికారి బి.సురేష్‌కుమార్, కోఆర్డినేటర్ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

చిక్కడపల్లి: గాంధీనగర్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన యాదగిరిని గురువారం గంగపుత్ర న్యాయవాదులు, ఉపాధ్యాయుల సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా ఏసీపీకి మొక్క అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విశ్వేశ్వర్‌రావు, మల్లేష్, భూపతి, ఉపాధ్యాయం సంఘం నాయకులు గోపి, సతీష్ పాల్గొన్నారు.



ఎద్దుల ఫొటోలను పోస్టు చేయొద్దు

- చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్
- జీవ వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని సూచన

ముషీరాబాద్: బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని... జీవ వ్యర్థాలను రోడ్లపై వేయొద్దని చిక్కడపల్లి ఏసీపీ ఎస్.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. ఎద్దుల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని సూచించారు. గురువారం ముషీరాబాద్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ జి.రాంబాబు అధ్యక్షతన నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ముషీరాబాద్ పీఎస్ పరిధిలో బక్రీద్ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది.

◆ ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... జూన్ 7వ తేదీన జరిగే బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో త్యాగానికి ప్రతిరూపంగా చేసుకోవాలన్నారు. ఈ పండుగ సందర్భంగా వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో వేసి జీహెచ్ఎంసీ స్వచ్ఛ ఆటోలో వేయాలి తప్ప రోడ్లపై వేయొద్దని సూచించారు. పండుగ సందర్భంగా ఇతర వర్గాల మనోభావాలను దెబ్బతీయకుండా నిర్వహించుకోవాలని సూచించారు. ఎద్దులను తీసుకొచ్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అక్రమంగా పశువులను వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువుల చర్మాలను శుద్ధి చేసే సందర్భంగా వెలువడే వ్యర్థాలను రోడ్లపై రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

◆ ముషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.రాంబాబు మాట్లాడుతూ... పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, ఎస్సైలు ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పీస్ కమిటీ మైనార్టీ నాయకులు అక్తర్ ఆలీ, షరీఫ్ హుస్సేన్, ఎండీ మోహిన్, అక్లక్‌హుస్సేన్, ఎజాజ్ హుస్సేన్, మసూద్, జావేద్‌ఖాన్, మహ్మద్ గౌస్, ముతావలి నజీర్‌ఆలీ, శంకర్‌గౌడ్, మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్

వదంతులు నమ్మొద్దు: కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్

అంబర్‌పేట: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్ కోరారు. పండుగులను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. గురువారం ఛేనంబర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ఫేక్ వీడియోలను పోస్టు చేసి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దని అన్నారు. అలాంటి వాటిపై పోలీసులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికంగా పోలీసులతో పీస్ కమిటీ సభ్యులు శాంతి భద్రతలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన తెలిపారు. పండుగల సందర్భంగా వందతులు నమ్మొద్దని ఆయన కోరారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమర్, ఇతర సిబ్బందితో పాటు నాయకులు జి.ఆనంద్‌గౌడ్, మహేందర్, మైలారం రాజు, ఫరీద్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కాచిగూడ ఏసీపీ హరీష్‌కుమార్

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
G.W.O.P.No. 12 of 2025

Between:
1) Nooru Rajeshwari, W/o. Nooru Sathish Kumar, Aged about 36 years, Occ: Household
2) Nooru Siri, D/o. Nooru Sathish Kumar, Aged about 16 years, Occ: Student
3) Nooru Ananya, D/o. Nooru Sathish Kumar, Aged about 11 years, Occ: Student Petitioners No.2 & 3 are being minors Under the guardianship of their mother Nooru Rajeshwari W/o. Nooru Sathish Kumar Aged about 36 years, Occ: Household
All are R/o. H.No.1-6-202/8/A/3, Bapuji Nagar, Musheerabad, Hyderabad, T.G. ...Petitioners
AND
All Concerned
To
All concerned ...Respondent

Please take notice that the above named Petitioner No.1 has filed the above G.W.O.P No.12 of 2025 for appointment of guardian of her minor daughters Nooru Siri, aged about 16 years and Nooru Ananya, aged about 11 years, R/o. H.No.1-6-202/8/A/3, Bapuji Nagar, Musheerabad, Hyderabad, T.G. and permission to sell the schedule of property and the above OP is posted on 10.07.2025 at 10:30 AM in the above mentioned court, if any person or persons have any objection for the same may approach the Hon'ble Court personally or through an advocate, otherwise they will set exparte.

SCHEDULE OF PROPERTY

All that the Undivided Share of 103.5 Square Yards in House Bearing Municipal Nos.1-8-7/5 and 1-8-7/5/A on Plot No.13, consisting of Ground, First and Second Floors, (out of 207 Square Yards), Situated at Sarvodaya Colony, Chikkadpally, Hyderabad, and bounded as follows; North: Neighbour's House No.1-8-7/4, South: Neighbour's House No.1-8-7/6, East: 20 Feet Wide Road, West: Compound

// By the order of the court //
Sd/- **T. ALI MIRZA**, Advocate
22-8-362, Darulshifa, Hyderabad.
Cell No.9849097653